క్లుప్తంగా

మెనూను పాటించాలి



ఉదయగిరి: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. స్థానిక దళిత వాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరును పరిశీలించి ప్రతిరోజూ ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదుచేయాలని హెచ్‌ఎం ఎస్‌డీ హుస్సేనికి సూచించారు. విద్యార్థులు వర్క్‌బుక్‌లను పూర్తిచేసేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలివ్వాలని వినతి



ఉదయగిరి: గత కొన్నేళ్లుగా తమ అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కృష్ణారెడ్డిపల్లికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన భూమిలేని నిరుపేదలు గత పదేళ్లుగా లింగాలవాగు సమీపంలోని ప్రభుత్వ భూమిని బాగు చేసుకుని కంది, మినుము, ఉలవ, తదితర వర్షాధార పంటలను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న భూపంపిణీ కార్యక్రమంలో భూములను సాగుచేసుకుంటున్న పేదలకు భూపట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎంపీటీసీ కాక విజయమ్మ, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులోని మద్యం దుకాణాన్ని సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. మద్యం స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయించాలని సిబ్బందికి సూచించారు.

వలంటీర్లకు ఇంటర్వ్యూలు



మర్రిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు ఈఓపీఆర్డీ మస్తాన్‌ఖాన్ శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏపిలగుంట, చిలకపాడు, నందవరం, పడమటి నాయుడుపల్లి పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు 17 మంది దరఖాస్తు చేసుకోగా, 15 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఈఓపీఆర్డీ తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడులో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పంట కాలువల్లో పూడికతీత పనులను ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి పనులను గుర్తించి కూలీలకు పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఉన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



అల్లూరు: స్థానిక మసీద్ సెంటర్‌లోని జెండా చెట్టు వద్ద ఖాదర్‌వలి గంధ మహోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ ఉస్మాన్‌షరీఫ్, షేక్ మాబాషా, షేక్ షబ్బీర్, షేక్ సాబీర్, షేక్ మసూద్, షేక్ షన్నా, షేక్ అబ్దుల్లా, షేక్ అబీద్, షేక్ జంషీర్, తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా..ప్రాణం మిన్న

కావలి రూరల్ : వేగం కన్నా..ప్రాణం మిన్న అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని యువత వాహనాలు నడపాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. యువకులు ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను గుర్తుంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, డ్రైవర్లు, ఆర్టీసీ కార్మికులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆర్టీఓ శీనానాయక్, డీఎస్పీ వెంకటరమణ, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు పాల్గొన్నారు.



కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, ఆర్టీఓ శీనానాయక్, డీఎస్పీ వెంకటరమణ

వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి

మర్రిపాడు: వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎంవీఐ రాములు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు, మర్రిపాడు ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, అపరిమిత వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవర్లకు నిద్ర వచ్చినప్పుడు వాహనాలను రోడ్డు పక్కన నిలిపి విశ్రాంతి తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్, వాహన లైసెన్స్‌లను కలిగి ఉండాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



మర్రిపాడు: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

వైభవంగా ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పవిత్రత ఉట్టి పడేలా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తెలిపారు. బిలకూటక్షేత్రంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీకి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర వసతుల కల్పనతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్సవాలు సకాలంలో పూర్తయ్యేలా చూడడంతో పాటు దేవుడి దర్శనానికి తరలివచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఆలయ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, సర్పంచ్ శ్రీరాం గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేంద్రరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఓటుకు ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయాలి

ఆత్మకూరురూరల్: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను నూరు శాతం పూర్తి చేసేందుకు బీఎల్వోలు కృషి చేయాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 70 శాతం మేర ఆధార్ అనుసంధాన లక్ష్యాన్ని పూర్తి చేసిన బీఎల్‌ఓలను అభినందించారు. ఈ నెల 26లోగా నూరు శాతం ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. డీటీ రాజేష్, ఆర్‌ఐ సతీష్, వీఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహం

క్రికెట్ పోటీల విజేత వీరారెడ్డిపాళెం

జలదంకి: సంక్రాంతి సందర్భంగా వేములపాడులో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో వేములపాడు జట్టుపై కలిగిరి మడలం వీరారెడ్డిపాళెం జట్టు విజేతగా నిలిచింది. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సురేష్ విజేత జట్టుకు రూ.15,116, రన్నర్ జట్టుకు రూ.10,116 నగదు బహుమతులు అందజేశారు. వేములపాడు జట్టుకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. అనంతరం వేములపాడు ఎస్సీ కాలనీకి చెందిన వెన్నుముక ఆపరేషన్ చేయించుకున్న పూతల శేషమ్మకు రూ.10 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న దొరసానమ్మ, లక్ష్మమ్మకు ఆర్థికసాయం అందజేశారు. క్రికెట్ పోటీల నిర్వాహకులు తేలప్రోలు పెంచలయ్య, పూతల వెంకటేష్, పసుపులేటి సిద్దు, రావుల వెంకటేష్, చేవూరి లక్ష్మణ్, జగన్నాథ మహేష్, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న సురేష్

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఆత్మకూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని ఎంజీఆర్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు వలంటీర్ల వ్యవస్థను అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలతో అధ్యయనం చేయించాయని తెలిపారు. అలాంటి వలంటీర్ల వ్యవస్థపై ఎల్లోమీడియాలో అసత్య కథనాలు ప్రచురించడం దారుణమన్నారు. పేదలకు మేలు చేకూర్చే వలంటీర్ల వ్యవస్థను ప్రతిపక్షాలు విమర్శించడంపై ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు చేసిన దారుణాలను ఆ పార్టీ నాయకులు మర్చిపోయారని ప్రశ్నించారు. ఇకనైనా ఎల్లోమీడియా ద్వారా విషపు కథనాలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఐవీ రమణారెడ్డి, కలాం, జయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లో మీడియా వక్రరాతలను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రుణ బకాయిదారుల భూముల వేలం

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడుకు చెందిన కర్రి వెంకటరెడ్డి 2016లో తన 10.28 ఎకరాల వ్యవసాయ భూమి మీద ఉదయగిరి కేంద్ర సహకార బ్యాంకులో రుణం పొందారు. రుణాన్ని సకాలంలో చెల్లించకపోవడంతో భూములను ఆ బ్యాంకు అధికారులు శుక్రవారం వేలం వేశారు. సచివాలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో ముగ్గురు వ్యక్తులు రూ.65వేలు చొప్పున ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు. తొలుత బ్యాంకు సేల్ అధికారి ఫణీంద్రబాబు రూ.25.70లక్షలతో వేలం పాటను ప్రారంభించారు. కాకొల్లువారిపల్లెకు చెందిన మాధవరపు నాగరాజు రూ.25,73,500కు వేలంలో భూములను దక్కించుకున్నాడు. వెంటనే 15 శాతం నగదు రూ.4 లక్షలు చెల్లించి పత్రాన్ని అందుకున్నారు. మిగిలిన సొమ్మును పదిహేనురోజుల్లోగా చెల్లించాల్సి ఉంటుందని, నెలరోజుల్లో భూములను రిజిస్టర్ చేస్తామని వేలం అధికారులు తెలిపారు. కాగా మున్నా అమరలింగయ్యకు చెందిన 7.81 ఎకరాను రూ.19.60 లక్షలు, చెన్నూరు శుభకరరెడ్డికి చెందిన 8.15 ఎకరాలను రూ.20.42 లక్షలకు జీ కొత్తపల్లెకు చెందిన బాలిబోయిన బాలయ్య గురువారం నిర్వహించిన వేలంలో దక్కించుకున్నట్లు వేలం అధికారులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జరగాల్సిన యెదురువాడ వీరభద్రావుకు చెందిన 10.49 ఎకరాల భూమి వేలాన్ని కోర్టు స్టేతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా ఓఎస్డీ అంజిరెడ్డి తెలిపారు. జూలకంటి సత్యనారాయణరెడ్డికి చెందిన 10.25 ఎకరాలు, జూలకంటి కృష్ణారెడ్డికి చెందిన 12.48 ఎకరాలకు బుధవారం వేలం నిర్వహించగా ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని వివరించారు.



భూముల వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

పేకాటస్థావరంపై దాడులు

వరికుంటపాడు: నల్లబోతులవారిపల్లె కాలనీ లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై బాల మహేంద్రనాయక్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.19,170 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం శివశంకరరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఎస్‌బీఐ యోనో యాప్ ద్వారా పలు లింకులను సెల్‌ఫోన్లకు మెసేజ్‌లుగా పంపుతున్నారని, వాటిని తెరిచిన వెంటనే బ్యాంకు ఖాతాల్లోని నగదును మాయం చేస్తున్నారన్నారు. ఇలాంటి లింకులు ఫోన్లకు వస్తే తెరవవద్దని, ఆధార్, పాన్‌కార్డుల వివరాలను ఎవరికీ చెప్పొద్దని సూచించారు. బ్యాంకు మెసేజ్‌లపై సందేహాలు ఉంటే సంబంధిత బ్యాంక్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసాలకు ఎవరైనా గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి

సోమశిల : తమకు ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని సోమశిల ప్రాజెక్ట్ వర్క్ చార్టర్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వర్క్‌చార్టర్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఉప్పలపాటి రామయ్యతో కలిసి సోమశిల ప్రాజెక్ట్ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తాము ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయికి పనిమీద వెళ్లినప్పుడు ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ సరిగా పనిచేయక ముఖ హాజరు విషయంలో ఇబ్బందులకు గురవుతున్నామని విన్నవించారు.

హెచ్‌ఎం హఠాన్మరణం



సుజాత(ఫైల్)

ఆత్మకూరురూరల్: వాసిలి మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని టీ సుజాత (56) శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. సహచర ఉపాధ్యాయులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన టీ సుజాత వాసిలి మెయిన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తోంది. శుక్రవారం రోజూలాగే విధులకు హాజరై సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లింది. బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు సమీపంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతిపై ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రగాఢ సతాపం తెలిపారు.

వినియోగదారులపై భారాన్ని తగ్గించాలి

ఆత్మకూరు: విద్యుత్ వినియోగదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని ఏపీ రైతు సంఘ నాయకులు కోరారు. ఏపీఎస్‌పీడీసీఎల్ 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ బిల్లుల టారిఫ్ పెంపుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ చేపడుతోంది. అందులో భాగంగా ఆత్మకూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు పలువురు హాజరై టారిఫ్ పెంపుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘ నాయకులు వినియోగదారులపై భారాన్ని తగ్గించాలని డీఈ బీ జనార్దన్‌కు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘ నాయకులు లక్ష్మీపతి, ఎల్‌కే ప్రసాద్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వీడాలి



సంగం: సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వాన్ని వీడాలని ఆత్మకూరు డీఎల్‌డీఓ రమణయ్య అన్నారు. తరుణవాయి, సిద్దీపురం సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ఎవరైనా గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ అప్పాజీ ఉన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీ కోళ్లదిన్నెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, సర్పంచ్ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జంపాని యలమందయ్య, పంది శివాజీ, జంపాని అశోక్, సుందరరాజ్, తదితరులు పాల్గొన్నారు.

23న వైఎస్ జగనన్న క్రికెట్ ఫైనల్స్

కావలి: పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌ను ఈ నెల 23న నిర్వహించనున్నారు. గత నెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2ను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డి సహకారంతో ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల దేవధీరజ్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 80 జట్లు పాల్గొన్నాయి. ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్స్ మ్యాచ్‌ల్లో లెవెన్ బుల్స్, ఎస్వీ లెవెన్ జట్లు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌మ్యాచ్‌కు ఎస్పీ సీహెచ్ విజయారావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



విజేతలకు అందజేయనున్న షీల్డులు

నూరుశాతం ఫలితాలను సాధించాలి

చేజర్ల: పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మేరీచంద్రిక అన్నారు. ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మెయిన్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత గురుకులంలోని వసతులను పరిశీలించారు. విద్యార్థులతో ప్రతిరోజూ వ్యాయామం చేయించాలని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లోని వసతులను పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఏఎంఓ జీ సుధీర్‌బాబు, గురుకుల ప్రిన్సిపల్ శైలజాకుమారి, మెయిన్ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీరాజ్యం, ఉపాధ్యాయులు ఉన్నారు.



గురుకులం ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న జేడీ మేరీచంద్రిక

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం

వింజమూరు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితమని, వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయని డీడీఓ డాక్టర్ శ్వేత పేర్కొన్నారు. సీహెచ్‌సీలో వైద్యుడు మధుమోహన్ తన సతీమణి సుజాతకు సిజేరియన్ కాన్పు చేయించడంపై ఏపీ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ప్రత్యేకంగా ప్రశంసాపత్రాన్ని పంపారు. ఈ ప్రశంసాపత్రాన్ని డాక్టర్ మధుమోహన్‌కు డీడీఓ శ్వేత శుక్రవారం అందజేసి అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. గైనకాలజిస్ట్ శ్వేత, శిశు వైద్యురాలు ఇంద్రాణి, అనస్థీషియన్ కార్తీక్, జనరల్ సర్జన్ కృష్ణ, వైద్యాధికారి జగదీష్, దంతవైద్య నిపుణులు సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.



మధుమోహన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీడీఓ శ్వేత

కంచర్ల ట్రస్ట్ సేవలు అభినందనీయం

అనుమసముద్రంపేట: కంచర్ల శేషయ్యనాయుడు ట్రస్ట్ సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య కొనియాడారు. రెయిన్‌బో ఆస్పత్రి అధినేత డాక్టర్ రమేష్‌నాయుడు చిరమన పీహెచ్‌సీకి అవసరమైన కంప్యూటర్లు, ఏసీ, ఇన్వర్టర్, కుర్చీలతో పాటు వివిధ రకాల పరికరాలను డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రమేష్‌నాయుడు కంచర్ల శేషయ్యనాయుడు ట్రస్ట్ ద్వారా లక్షలాది రూపాయల సొంత నిధులతో పీహెచ్‌సీకి అవసరమైన పరికరాలను సమకూర్చడం సంతోషకరమన్నారు. గతంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు రమేష్‌నాయుడు సోదరులు ఎంతో కృషి చేశారన్నారు. పీహెచ్‌సీకి ఎకరా స్థలాన్ని అందజేశారన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధికి పాటుపడుతున్న శేషయ్యనాయుడు కుమారుడు డాక్టర్ రమేష్‌నాయుడు, గ్లోబెల్, రెయిన్‌బో ఆస్పత్రుల నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ రమేష్‌నాయుడు మేనల్లుడు అంకయ్యచౌదరి మాట్లాడుతూ చిరమన పీహెచ్‌సీ కేంద్రాన్ని మోడల్ పీహెచ్‌సీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ వైద్యశాలను తనిఖీ చేశారు. శుక్రవారం డ్రైడే కావడంతో పడమరవీధిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు రహ్మతున్నీసాబేగం, జ్యోతిరాణి, క్రిస్టియాన, హెచ్‌ఈఓ షఫీ, పీహెచ్‌ఎన్ జ్యోతి, వైద్యసిబ్బంది సలోమి పాల్గొన్నారు.



పీహెచ్‌సీకి డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా పరికరాలు అందజేస్తున్న అంకయ్యచౌదరి

రైతులకు బహుముఖ సేవలు



సంగం: అవగాహన కల్పిస్తున్న ఏపీజీబీ అధికారులు



ఆత్మకూరురూరల్‌లో కళాజాత ప్రదర్శన

ఆత్మకూరురూరల్: సహకార బ్యాంక్ ద్వారా రైతులకు బహుముఖ సేవలు అందిస్తున్నామని ఆ బ్యాంక్ ఆత్మకూరు శాఖ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో వెన్నవాడ పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ చక్ర రుణ పథకం కింద తక్కువ వడ్డీకి రైతులకు కార్లు, ద్విచక్ర వాహనాల కొనుగోలుకు ఆరు నెలల కాలపరిమితితో రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. భూముల అభివృద్ధి పథకం క్రింద ఒక్కో ఎకరాకు రూ.1.50 లక్ష చొప్పున పంట రుణాలు అందిస్తున్నామన్నారు. సహకార అమృత్ డిపాజిట్ పథకం క్రింద 599 రోజుల కాలపరిమితితో సీనియర్ సిటిజన్లకు 7.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. సహకార బ్యాంక్ సూపర్‌వైజర్లు జనార్దన్‌రెడ్డి, శేషయ్య, వెన్నవాడ పీఏసీఎస్ కార్యదర్శి ఇంటూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంగం: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు దువ్వూరు శాఖ ఆధ్వర్యంలో వెంగారెడ్డిపాళెంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఏపీజీబీ సేవలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, ఏపీజీబీ చైర్మన్ రాకేష్‌కశ్యప్, రీజనల్ మేనేజర్ కే శైలేంద్రనాథ్, ఏపీజీబీ దువ్వూరు బ్యాంకు మేనేజర్ ధర్మపురి బాలకృష్ణ, ఏపీజీబీ సిబ్బంది, వలంటీర్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నరేష్, పొదుపు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.